
# వినత చెప్పిన కథ



కథానిక

"ఏదో చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుందే" అని పలకరించింది సునీతి. వినత జవాబుగా దగ్గరఉన్న కుర్చీని ముందుకుతోసి చిరునవ్వుతో-

"కూర్చో ఈమధ్య బొత్తిగా క్లబ్బుకిరావడం మానేశావ్" అన్నది సునీతి కూర్చుని "బోయ్! రెండు లెమనేడులు తీసుకురా" అని ఆజ్ఞాపించింది. "ఏమిటి విశేషాలు" అన్నట్లుగా సన్నని కనుబొమ్మల్ని ప్రశ్నార్థకంగా ఎగరవేసింది వినత.

అంతవరకూ నిర్జీవంగా ఉన్న క్లబ్బు, సాయంకాలం కాగానే కలకల్లాడ్డం మొదలుపెట్టింది. కార్లలో దిగి మల్లెపువ్వులకంటే సుకుమారంగా ఉన్న చీరల్ని సవరించుకుంటూ, రంగు పూసిన పెదిమలూ, గోళ్ళతో అందాల చేలిసంచులని వెదజల్లుతూవచ్చే యువతులు, అచ్చంగా దొరలమేమో అనుకుంటూ, జంటగానూ ఒంటరిగానూ 'పాశ్చాత్య నాగరికతా పరిపక్వమే తాము' అన్న గర్వంతో టైలు సర్దుకుంటూ, గేటుదగ్గర హేటులందించి త్రోవలో కనబడే పరిచిత యువకుల్ని యువతుల్ని చిత్రవిచిత్రంగా పలకరించుకుంటూ సోఫాలు చేరే యువకులు, ఒక్కొక్కరే వచ్చిచేరారు. ఎవరికావల్సిన డ్రింకులు, తినుబడి వస్తువులు హడావుడిగా తెప్పించుకుంటున్నారు. ఎవరిమట్టుకు వాళ్ళకే చెప్పడానికి చాలా ప్రగల్భాలున్నాయి. హాయివినుబులు లేకుండా చెప్పుకుపోతున్నారు. కాని ఉత్సాహంతో వినేవాళ్ళ సంఖ్య చాలా తక్కువ

వినత ఆ వచ్చేవాళ్ళనంతా చిత్రలేఖనకై చూచే నమూనాల్లా చూస్తూంది. పలకరించిన వాళ్ళకి మంత్రముగ్ధుల్ని చేసే చల్లని చిరునవ్వొకటి పారేసేది. బహుకొద్దిమందికి తప్ప, వినత 'గర్విష్టి' అని అభిప్రాయం ఇదెలా అర్జించిందంటే, తక్కిన యువతుల్లా, లంచిలు, డిన్నర్లు ఇవ్వకపోడం, సొసయిటీగాసిప్‌కి, కల్పనలకి సహాయం చెయ్యకపోడంవల్లనే అసలు అంత దూరదూరంగా తిరిగే మనిషి క్లబ్బుకి ఎందుకొస్తుందో కూడా ఎవ్వరూ గ్రహించలేకపోయేవారు.

"నీతో మాట్లాడ్డానికే వచ్చాను వినతా!" అన్నది సునీతి.

"ఏం? కరుణకప్పుడే పెండ్లిచేయదలుచుకున్నావా?" (ఆలోచనలో పడ్డట్టు ముఖంపెట్టి,) "ఇప్పటికి మా సుదేవ్ ఒప్పుకుంటాడో ఒప్పుకోడో!" అని చిన్నగా నవ్వింది. సునీతికూడా నవ్వింది సుదేవ్ వినత కొడుకు. పదహారేళ్లుంటాయి. కరుణ సునీతి కూతురు, ఎనిమిదేండ్లు.

"పోమ్మా! నువ్వొక్కడూ అంతే... ఒప్పుకోక ఏంచేస్తాడేం? లేకపోయినా బలవంతాన్న కట్టిపెడతాకాని, ఒదుల్తాననుకున్నావేంటి? అదికాదిప్పటి విషయం. కరుణకో మాష్టార్ని పెట్టాం చూచావా?" అని అడిగింది సునీతి.

"ఓ! చూడకేం ఎర్రగా పొడుగ్గా, లావుగా, నల్లగా సన్నగా పొట్టిగా ఉంటాడాయనేనా?" అడిగింది మాటలు గబగబా దొర్లిస్తూ... సునీతికి నవ్వు కోపం ఒక్కసారిగా రావటాన్న చిన్నపిల్లలా బుంగమూతి పెట్టింది. వినతకి ఎవ్వరివన్నా సంసారం గొడవలు వినడ

గోపి

మంటే విసుగు. సునీతి చెప్పేదంతకన్నా మరేమీ ఉండదని కూడా తెలుసు. సునీతి నవ్వుకి విడుపుకి మధ్యగా ముఖం పెట్టేసరికి, చెప్పేది కాస్తా వినక తప్పదని తేలిపోయింది. క్లబ్బులో ఎవరెవరున్నారో వారున్నా, పత్రికా విలేకరుల్లాగే పక్కవాళ్ళు మాట్లాడే రహస్యాలకి మాత్రం ప్రత్యేక స్థానం ఉందని తెలుసు. సునీతి భుజంమీద చెయ్యివేసి క్లబ్బు ఆవరణలో ఉన్న లాన్‌మీదికి తీసుకుపోయింది.

వీధిదీపాలు వెలిగించారు. చల్లటిగాలి సముద్రం మీదనుంచి వస్తూంది. దూరాన్న వస్తూన్న కారు లైట్లు ఆ తేమ వాతావరణంలో అరుణోదయంలోలా ఆకాశాన్ని తేజవంతం చేస్తూ మాయమవుతూన్నాయి. నిశ్శబ్దంగా ఉన్న ఒక్కక్షణం సముద్రపుఘోష వినపడుతూంది. లాన్‌లో ఒక మెర్క్యురీ వేపర్‌లాంపుక్రింద కూర్చుని అడిగింది వినత.

"కక్కవమ్మా నీ కడుపులో బాధ" అని చాలా తేలిగ్గా.

"ఛా, నీతో ఏంచెప్పను" అంది సునీతి విసురుగా.

"ఐతే నే పోతా" అని లేవబోయిన, వినత చెయ్యిపట్టి మళ్ళా క్రింద కూర్చోపెట్టింది. మెర్క్యురీ దీపంముందు ప్రశాంతంగా ఉన్న వినత ఒక దేవదూతలా కనిపించింది సునీతికి. ఒక్కనిముసం అల్లాగే రెప్పవాల్చకుండా చూచి, ఒణుకుతూన్న గొంతుకలో అడిగింది సునీతి.

"ఎప్పుడన్నా భర్తకాకుండా, మరెవరితోనన్నా సాంగత్యం కోరావా వినతా?" అని కొస మాట సగందాకా కొరికేసింది గాభరాతో.

వినతగుండె దడదడా కొట్టుకుంది. కాని లోతుగుండె కలది. చిన్ననవ్వు నవ్వి "ఇదిగో ఈ సి. ఐ. డి. పని ఎప్పణ్ణుంచీ ఆరంభించావ్!" ఇదిగో పిస్తోలు "ఢాం"మని పేలుస్తా అని చిన్నపిల్లలు రెండుచేతులూ కలిపి పిస్తోలుగా బెదిరించేట్టు పెట్టింది. సునీతి నవ్వకపోగానే "నువ్వేవో చెప్తావని లాక్కొచ్చి నన్నెందుకిలా క్రాస్ ఎగ్జామిన్ చేస్తావమ్మా!" అన్నది లాలనగా.

సునీతి సందేహంలో పడింది. "అడగడమా మానడమా?" అని. ఇంకెవర్ని అడిగినా వాళ్ళ నోళ్ళకి తాళాలు లేవాయె. బొంగురుపోయిన గొంతుకతో మొదలుపెట్టింది.

"నిన్నడగడం నీ రహస్యాలు తెలుసుకుందికి కాదమ్మా. నువ్వగ్నిహోత్రంలాంటి దానివని అందరికీ తెలుసు. అందుకనే నీకందరూ "గ్రా" అని కూడా అపోహపడ్డం... చెబుతా విను" అని చేతిరుమాలు తీసి ముఖంమీద చిరుచెమటని తుడుచుకుంటూ ఆరంభించింది.

"కరుణకి పాఠం జరగటంలేదు సరిగ్గా. ఆయనకి ఇంటిబాధే లేదు. ఎప్పుడూ వర్తక వ్యాపారాల్లో, నెలకి నాలుగువారాలూ టూర్లే, నా పనిలో నేనుండటం, కరుణ మేష్టార్ని చెవులు పట్టుకు ఆడించడం మొదలుపెట్టింది.

"నిన్నటేం చెప్పేనో చదువు" అన్నాడు మాష్టర్. "నిన్న ఆదివారం మాష్టర్" అని కిలకిలా నవ్వింది. మాష్టారు కంగారుగా "మొన్న చెప్పింది చదువ్" అన్నాడు. మొన్న శనివారంనాటి సినీమా, ఇవీ అవీ చెప్పి కబుర్లలో దించింది... ఇష్టంలేని పాఠాలని జిగురుతో అంటించడం, మేష్టారు వచ్చేటైముకి ఎక్కడికో చక్కర్ కొట్టడం, ఇలా అల్లరపెడుతూంది. ఇల్లా వదిలిపెడితే పిల్లలు బొత్తిగా పాడౌతారని నే స్వయంగా కూర్చోవడం మొదలుపెట్టాను. మా కోవలోఉంది కాబోలు. మాష్టార్ని నేనూ ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టాను. రాను రానూ, రాజకీయాలు, సినీమాలు సాంఘిక సమస్యలు గంటలతరబడి మాట్లాడేవాళ్లం. అసలు కరుణ చదువే మరిచిపోయేదాన్ని. ఇప్పుడాయన్ని ఒక్కసాయంకాలంకూడా చూడకుండా ఉండలేకపోతున్నా. మూతి బిగించుకొని గదిలో కూర్చున్నా ధ్యానం అంతా అటువేపే. ఈ చిత్తచలనానికి పర్యవసానం కానీ, గమ్యస్థానం కానీ తోచకుండా ఉంది... మా ఆయన ఎంత మంచివారో నీకు తెలుసునుగా!" అంది ఏదో భారం తగ్గినట్లు నిట్టూర్చి.

వినత సలహా చాలా పనికొస్తుందని నమ్మింది సునీతి. వినతకి ఏం చెప్పడానికీ తోచలేదు. "చిత్తచలనం తప్పు" అంటే పాతరాస్తా మనిషి క్రింద కడుతుంది. ఇంతకీ ఆమె తరహాకి కావల్సినంత స్వాతంత్ర్యంఉంది. "తప్పులేదు" అనడానికి

ఈ చిత్తచాంచల్యానికి మానసికంగా ఎలాంటి పునాది ఉందో తెలీదాయె. ఒకసారి జారినాక మళ్ళా సర్దుకుందికి అవకాశంలేని పరిస్థితి...రాత్రి తొమ్మిదైంది. వేగిరం ఇండ్లకు పోయేవాళ్ళు వెళ్ళిపోగా, మిగతా ప్రజ క్లబ్బుల్లో తాగుడు, జూదాల్లో పడ్డట్లు వాళ్ళగలంతే తెలియపరుస్తూంది...సద్దు మణిగింది. గోలలేనప్పుడు సముద్రపుహోరు ధాటీగా వినబడుతూంది. ఒక్క క్షణంలో సునీతికి ఏం చెప్పాలో తోచింది. కాని ముగ్గురుకిమాత్రం తెలిసిన తన జీవితగాథలో రెండేళ్ళచరిత్ర సునీతికి చెప్పడమా? మానడమా? కానీ సునీతి తన సంశయాన్ని అంత ఇదిగా చెప్పినప్పుడు నమ్మకపోడం ఎల్లా?

"చాలా చిక్కు ప్రశ్న వేశావమ్మా! నీ ప్రశ్నకి సమాధానం చెప్పడానికి బదులు నాసోది కొంచెం చెబుతా' విను. అది విన్నాక ఆలోచించు" అంటూ మెల్లగా మొదలుపెట్టింది తన కథ.

"మేం ఆరేళ్లు బర్మాలోఉండేవాళ్ళం తెలుసు కదూ! అది కలక్టర్ పనిలాంటిదిలే, మా ఆయన కక్కడ కారూ వ్యవహారం అంతా ఉండేది. '42 లో మొదటిసారి బాంబులు పడ్డాయికదూ, అంతకుముందే అన్నారు.' 'వినూ, నువ్వు సుదేవు ఇండియాకు వెళ్ళండి, నేనుకూడా రావడానికి ప్రయత్నంచేస్తాను అన్నారు' నే ఒప్పుకోలేదు. సుదేవుని, మాకుండే వెండి బంగారాలని బొంబాయిలో వాళ్ళ నాన్నగారింటికి పంపించేశారు. ఇద్దరం ఎక్కడున్నా బాధలేదనుకున్నాం.

రంగూన్‌కి 40 మైళ్ళదూరంలో కేంపులో ఉన్నాం. "సాయంకాలంలోపల వచ్చేస్తా తిరిగి కాని చాల జాగ్రత్తగా ఉండాలి రంగూన్‌లో చాలా గగ్గోలుగా వుందట. 'ఆత్మసంరక్షణ' మొదటివిషయం సుమా!" అని ఏన్నో చెప్పి ఒక దర్వాన్‌ని సహాయంఉంచి, వదల్లేక వదిలేరు... ఆయనవెళ్ళి ఇంకా రెండుగంటలన్నా కాలేదు. ఏదో పుస్తకం చదువుకుంటూన్నా దర్వాన్ రొజుకుంటూవచ్చి "జపాన్‌వాళ్ళు పేరచూట్లలోంచగి ఊవూరే నడుస్తున్నా"రని చెప్పాడు. మొదటిసారిగా నా మొండిపట్టుకి ఫలితం కనిపించింది. వెనకాముందూ చూడకుండా కొంచం బిస్కట్లు మంచినీళ్ళుమాత్రం సేకరించి అడవి మార్గంపట్టాం - నేనూ దర్వానూ. జపానువాళ్ళు చేయని అత్యాచారాలు లేవని అంతకుముందే చాలాచాలా విన్నాం! అడవి జంతువులబారి చిక్కడం, ఆ రాక్షసులచేతుల్లో పడ్డంకంటే నయమే అనిపించింది. ఒకరోజల్లా నడిచాక కాళ్లు బొబ్బలెక్కాయి. "యిక నడవడంకష్టం" అని చెప్పాను. మొదటిసారిగా అనుమానం వేసింది "ఇంత హడావుడీ ఉత్తిదేనేమో వాళ్లెవరూ రావడంకూడా చూడలేదు" అని. కాని ఆత్మసంరక్షణంటే అల్లాగే ఉంటుంది. దర్వాన్ కూడా అదే ఆలోచిస్తున్నాట్ట! దైవవశాత్తు ఒక రెండుగుట్టలమధ్య ఒక బొరియ కనబడింది అక్కడ ఆరాత్రి విశ్రమించాం.

తెల్లవారింది. చేతిసంచిలోంచి బిస్కట్లుతీసి దర్వాన్‌కో యిన్నియిచ్చి నేనో యిన్నితిన్నాను. మొదటిసారిగా మా ఇద్దరికీ మధ్యనున్న అధికారి-సేవకుడుఅనే సంబంధం వదిలిపోయింది. స్వేచ్ఛగా మాలోమేంపడ్డ బాధలు చెప్పుకున్నాం. నాకో మగదక్షతంటూ ఉండడాన్న ఆ కీకారణ్యంలో కూడా ఏమంత బాధనిపించలేదు!

మళ్ళా ప్రయాణం సాగించాం. నా కాళ్ళు బొత్తిగా బొబ్బలెత్తాయి. నాఅవస్థ గ్రహించినట్లుంది ఒక చెయ్యూతిచ్చాడు. మొదటిసారిగా శ్రామికచేతి చమటుకంపుని అసహ్యించుకోలేదు. సాయంకాలం నాలుగైదుగంటు లౌతుందనుకుంటూ. ఆ దట్టమైన అడవిలో అప్పుడే చీకటి కమ్ముతోంది. దాహం చాలా జాస్తిఐంది. నీళ్ళు వెతుక్కువస్తానని, ఒక బయలు ప్రదేశంలో నన్ను వదలి వెళ్ళాడు. ఒకరాయికి తలానించుకు ఆలోచనలో పడ్డాను. "ఎక్కడివాళ్ళం? ఎక్కడిని వచ్చాం? ఎక్కడికి వెళతాం?" అని. చిన్న మమతలా నిద్రపట్టింది. మళ్ళా తెలిసి వచ్చేసరికి పూర్తిగా చీకటైంది. గుండె దడదడాకొట్టుకుంది. దర్వానేమైనట్లు? పారిపోయాడా? ఏ పులివాతన్నా పడ్డాడా, అరణ్యరోదనం అంటే యిదే కాబోలనుకున్నా. ఎక్కడిదో నాలో ఆశక్తి? మళ్ళా కాలిబాటని చూచుకుంటూ ముందుకి సాగిపోయా. ఎండుటాకులమీద గలగలశబ్దం, వినపడితే ప్రాణం అమాంతంగా ఎగిరిపోయేది. "ఎందుకో ఈ జీవితంమీద యింత మమకారం?"

అనుకుంటాం తీరుబాటుగా వున్నప్పుడు. కష్టాలు కలగ్గానే "ఆత్మహత్య చేసుకుందాం" అనుకున్నానని తరువాత చెబుతాం. కాని ఆత్మసంరక్షణ ముందేపీ పనికిరావు. ఇదంతా వింటూంటే విసుగేస్తుందా? అని ఆపింది వినత.

"లేదమ్మా నివురుగప్పిన నిప్పులావుంటావు, నీ జీవితంలో ఇలాంటి సంఘటనలు కూడా వున్నాయా అని చూస్తున్నా."

"ఇంకావిను అప్పుడేమైంది" అంటూ సాగించింది.

"నా జీవితంలో వెలుగుచూ ది ముచ్చటపడ్డం ఒక్కనాడే! నా జీవితాన్ని కెల్లా వెలుగు. దూరాన్న కనిపించింది. కాని వెంటనే తలములిగి నన్ని అనుమానాలు, కొండవాళ్ళు నివసించే పరిసరాలు, నిండు యౌవనంతో వున్న నన్నేంపాట్లు పెడతారో అని. కాని వెనకఅడుగు వెయ్యలేదు కదా! అప్పట్లో ఆత్మాభిమానంకంటే కూడా ప్రాణరక్షణ: నీచంగా కనబడలేదా సునీ!

వెలుగు ననుసరిస్తూ సుమారు ఒకగంట నడిచివుంటాను, పడుతూ లేస్తూ ..కనబడ్డ మొదటి ఇంటితలుపు తట్టాను. ఏ ఆటవికుడో బల్లెంకత్తులు పట్టుకు తలుపుతీస్తాడని అరచేత ప్రాణాలుపెట్టుకు నిలబడ్డాను. ఒక నలభైఏళ్ళ బర్మాయువకుడు తలుపుతీశాడు. ఆయన కొండవాడుకాదని చూడగానే పోల్చుకోవచ్చు...

"ఇంట్లో ఆడవాళ్ళున్నారా?" అని అడిగాను, ఈ కొండల్లో కెల్లావచ్చాడా అని ఆశ్చర్యపోయి చూస్తూ!

"మీరు ఇంట్లోకివస్తే ఉంటారు" అని విషాదంగా నవ్వి ఇద్దరు చంటిపిల్లలూ తనూ శత్రువుల బారినుండి తప్పించుకొని యీ కొండలు చేరుకున్నది సంగ్రహంగా చెప్పి "ఈ పిల్లలతల్లి ఏంబాధ పడుతూందోగదా శత్రువుల చేతుల్లో" అని నిట్టూర్చి లోపలికి ఆహ్వానించాడు, ఆప్యాయంగా. నా సంగతి గ్రహించినట్లున్నాడు వెంటనే ఏవో తినేందుకిచ్చాడు. అక్కడగడ్డినే మరోభాగంచేసి పండుకుందుకిచ్చి, తీరుబాటుగా మాట్లాడుకుందాం నిద్రపోండీ రాత్రి" అనిచెప్పి ధైర్యంగా నిద్రపోయాడు. వినత మళ్ళాఆపి, "ఏం విసుగేస్తేచెప్పు మానేస్తా"నని హెచ్చరించింది. కాని సునీతి ఊపిరిబిగపెట్టి వింటూంది.

"రాత్రి చాలాభాగం గడిచినట్లుంది లోపలికి పోదామా?" అని మళ్ళాఅడిగింది.

"ఊఁ హూఁ, యిక్కడే బాగుంది. నీకథ పూర్తికానివ్వు"

"తీరా ఆలశ్యంగా ఇంటికి చేరేసరికి,మీవారు వచ్చిఉంటే అందరిలాంటి దానివే అనుకుంటారు సుమీ సునీ!" అని ఆపహాస్యంగా బెదిరించి మళ్ళా ప్రారంభించింది వినత

"ఏముందీ మర్నాటినుంచీ ఇంటి డ్యూటీ నామీద పడింది. బర్మాలో ఆరేండ్లు ఉండటాన్న భాష అంతగా బాధలేకపోయింది. పిల్లలిద్దరూ ఎంతో ముద్దొస్తూ ఉన్నారు. మూడేండ్లఅమ్మాయి ఆరేండ్ల అబ్బాయి. అల్లరి ఉపద్రం చేసేవారు!

చుట్టూ కొండలు, చల్లని మంచినీళ్ళ సెలఏరు, ఎటుచూచినా వాసనలని వెదజల్లే చక్కని పువ్వులు, సూర్యోదయంనుంచి సూర్యాస్తమానం వరకూ అమిరే ప్రకృతి సౌందర్య కళలని ఆరాధిస్తూ కూర్చోవచ్చు! అయిన్నీ చూస్తే చాలా సిగ్గుగానే ఉండేది మొదట్లో. పొద్దున్నే అడవిలోకి పోయి కట్టెపుల్లలు, దొరికేవి ఏవేవో తిండిగింజలు తీసుకొచ్చేవా రాయన. పిల్లలకి ఆయన దగ్గిరట్టే చనువు లేనట్లుంది, నాదగ్గరే ఉండేవారు. వారానికో సంత. ఆ సంతలోమట్టుకు ఉప్పూ పప్పూలు మార్పుకి దొరికేవి.

ఇంకా వారమన్నా కాలేదు. బ్రతుకు ఒక రాస్తా పడుతూందనుకుంటూంటేనే పిల్లకి ఉష్ణం వచ్చింది. ఏదో పోతుందిలే అని అశ్రద్ధ చేశాం. రాత్రికి ఎక్కువైంది. రాత్రి ఆయనా నేనూ పిల్లకి రెండు ప్రక్కలా కూర్చొని తడిగుడ్డతో ఒళ్లు తుడవడం, తడిగుడ్డ నెత్తిని వెయ్యడం చేశాం. ఎప్పుడూ తల్లికోసం పలవరించేకదా! అంతసేపూ వాసుదేవుడెల్లా ఉన్నాడో! అని నా మనస్సంతా గడబిడైంది... సరి తెల్లారింది ఆ కొండవూళ్ళో వాటి వైద్యుణ్ణి పిలచాం. దేవతని దయ్యమని ఏవేవో చేలి ఒక పసరు నెత్తిన రుద్దమని, నోట్లోకో ఇంత వేరు అరగదీసి పట్టమని ఇచ్చాడు. దానికిగాను నా చేతి గాజొకటి ఊడదీసి ఇచ్చాను! మానవుడన్నాక ఏదో ఒకటి చెయ్యకుండా ఉండలేంగా? రాత్రి మళ్ళా జ్వరం

తీవ్రంగా వచ్చింది, ఆయనైతే బ్రతుకాశ వదులుకున్నాడు. నేను మాత్రం పసరు రుద్దడం, మందరగదీసి పట్టడం మానలేదు ... మూడో రాత్రి కూడా అలాగే ఎక్కువైంది. ఆయన నిద్ర కాయలేక పోయాడు. పిల్లపక్కనే పడుకుని గురకపెట్టడం మొదలుపెట్టాడు. ఉష్ణం అప్పటివరకూ వదలడమేలేదు తగ్గడం హెచ్చడంతప్పిస్తే. వాసుదేవు దసలు బ్రతికేఉన్నాడా, ఎప్పుడన్నా కలుస్తామా? ఇదే నా ఆలోచనలు యెంతసేపూ! అర్థరాత్రి...ఆయన నిద్రపోతున్నాడు. చుట్టూ అడవి. చాలా భయం వేసింది...ఊసుపోడానికే అన్నట్లు ఆయన జుట్టులోంచి వేళ్లు పోనిచ్చి అనుకోకుండానే ఆడుకుంటున్నా ... మూడు గంటలైందనుకుంటూ, పిల్ల కళ్లు విప్పింది. నిలువునా చెమటలుపోయడం మొదలుపెట్టాయి. ఒళ్లు తుడిచి కొంచం వేడినీళ్లు మాత్రం కాచి పెట్టాను. మళ్ళా నిద్రపోయింది ప్రశాంతంగా. ఉష్ణం వదిలింది అన్న ఆనందంతో ఆయన జుత్తు పట్టి గుంజి "ఉష్ణం విడిచింది, మళ్ళా పడుకుంది" అని చెప్పాను. ఆ సమయంలో తన ఆనందాన్ని పట్టలేక నామీద పడి పదేపదే దొరికిన చోటల్లా ముద్దులవర్షం కురిపించాడు. నాకూ సిగ్గుగాని అభిమానంగాని వెయ్యలేదు. అదెంతో సహజమనిపించింది. "నే చూస్తుంటా నువ్వు పడుకో" అన్నాడు మొదటిసారిగా ఏకవచనంలో సంబోధిస్తూ!

సరి ఆ వేళనుంచి సంసారంలో అన్ని పనులతో పాటు సంపూర్ణ గృహిణీత్వం అబ్బిందని వేరే చెప్పనక్కర్లేదుగా! ఇదో కొత్తసంసారం పద్ధతనుకున్నాను స్త్రీ,పురుషులు ఎన్నో బంధాలతో కట్టుబడి ఉంటారు. సంఘం, నీతి, జాతీయత మొదలుగాగలవి. ఇరువురిలోనూ కూడా "ఎవరు గొప్ప?" అన్న ప్రశ్నకూడా ఉంటుంది. కాని అనాడు, వీటన్నిటికంటే సన్నిహిత సంబంధం ఉంది, రెండూ ఒకే పదార్థానికి వెనుకముందులు అనిగ్రహించాను. ఇంకా వింటే నీకే తెలుస్తుంది.

ఆర్నెల్లల్లా కలిసిఉన్నాం. ప్రపంచంలో ఏమౌతూందో కూడా మాకు తెలియటంలేదు. నాగరిక ప్రపంచంతో పూర్తిగా తెగిపోయాం, దారితప్పి మీదినుంచి "రొంయ్"మంటూ పోయే విమానాలు తప్పిస్తే, మాకు పరిచితశబ్దాలు ఏవీ వినబడటం లేనేలేదు వర్షాలు జోరునపడ్డాయి. కొండవాగు పొంగి ఇంటివరకూ కూడా దాడి చేసింది. బండరాళ్ళని దొర్లించి ఇంటిముందు మేటవేసింది. మా పాకకూడా ఎన్నోసార్లెగిరి పోవడం మరామత్తు చేసికోవడంకూడా జరిగింది. పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయ్, కాని మాకేం ప్రమాదం రాలేదు. చలికూడా కొద్దికొద్దిగా ప్రారంభించింది, ఎటుచూచినా పువ్వులు పళ్లు, చక్కని ఆకుపచ్చరంగుతో, "గునగున" పెరిగిన మొక్కలు, ఆ లోయని చూచినవాళ్లు తప్ప దాని సౌందర్యాన్ని అర్థం చేసుకోలేరు. పాత వాసనలు మరుపుకొచ్చి క్రొత్త సంసారానికి అలవాటుపడిపోయామా అనిపిస్తూవచ్చింది. ఆరోగ్యం కూడా ఎంతో బాగుండేది, పిల్లలు కాని నేను కాని ఆయనకాని ఎవ్వరూ జిర్రున చీదియెరగం! వర్షకాలంలో సింహగర్జనలాంటి ఉరుములు, భయోత్పాతం కలిగించే ప్రవాహాలు మహా వృక్షాలని పెల్లగించే సుడిగాలులు, మమ్మల్ని చాలా దగ్గర కీడ్చాయి. కాని శీతలగాలులు వెయ్యడం ప్రకృతి ఫక్కున నవ్వింది. చక్కని పువ్వులు పూచాయి. ఎక్కడనుంచో కమ్మని వాసనలు వచ్చేవి. ఎప్పుడూ ఇలాగే ఉండిపోతే బావుణ్ణనిపించింది కొన్నికొన్ని సమయాల్లో.

సరి ఆవాళ సంత. సంతకని వెళ్ళినాయన తిరిగిరాలేదు. కాలుకాలిన పిల్లిలా ఇంట్లోంచి పెరట్లోకి పెరట్లోంచి ఇంట్లోకి తిరిగాను. తండ్రి గురించి పదిసార్లన్నా అడిగారు పిల్లలు. రాత్రంతా జాగారంచేశాం. చీమ చిటుక్కుమంటే ఆయనేవచ్చారని చూచాం తిండికి ఇంట్లో ఏమీ లేవు. పిల్లలు మహాగోల చేసేవారు. అసహాయత్వంతో ఏడుపుకూడా వచ్చింది ఒక వారమే అలా వున్నా, యుగాలు గడిచినట్లైంది. పిల్లల్ని గోల పెడుతూన్నా గదిలోపల బంధించి నీళ్లు తెచ్చుకుందికి పోయేదాన్ని. చీకటి చీకటౌతూంది. తూగుతూ తూగుతూ ఒక మనిషి పాకప్రక్కగా పోతున్నాడు, ఆయనే అని దగ్గరికిపోయి చూస్తును కదా. ముఖమల్లా రక్తం, బట్టలల్లా రక్తం. వెంటనే చేయూతనిచ్చి ఇంటికి తీసుకెళ్ళి మంటు ముందు చూస్తే మరోమనిషి! ఎన్ని విచిత్రాలు,

సరి ఆలోచన చేయకుండా, ఆ దెబ్బలన్నీ కడిగి గుడ్డకట్టాను...రాత్రికి ఊరంత ఉష్ణంవచ్చింది. కాని ఏదో తెలీని మొండిధైర్యంతో ఆయన సేవ ప్రారంభించాను. రెండువారాలపాటు నేపడ్డ అవస్థ చెప్తే నువ్వు నమ్మవు ..కాని ఎంతో ధైర్యంగా ఉండేది రోజురోజూ ఆయన ఆరోగ్యం పొందాడు. ఆయన హిందూదేశస్థుడే. కాని భాష వేరు. ఐతేనేం ఇంగ్లీషులో మాట్లాడు కునేవాళ్ళం. ఐ. ఎన్. ఏలో చేరి ఇంగ్లీషు సేనలకి పట్టుపడి తప్పించుకువచ్చాడట మళ్లీ ఐ.ఎన్.ఏలో చేరడాకి వెళ్ళిపోతాడుట బాగుపడగానే అంటే అప్పుడే వెళ్ళిపోయినట్లు భయపడ్డాను.

పిల్లలకి ఆయనిదగ్గరచాలా చనువైంది. ఆయన నాకంటే మూడునాలుగేళ్ళు చిన్నే ఎప్పుడూ కిలకిలా నవ్వుతూండేవాడు. పిల్లలతో ఎలా మాట్లాడేవాడో నాకు తెలిసేదికాదు. ఒక్కక్షణం కూడా నాతోఉండేవారు కారు. పిల్లలకి కావల్సిన పళ్లు పూలు తేవడం, వాళ్ళతో ఆడుకోడం, పట్టుతేనే, పక్కలకిగా పక్షుల మెత్తని ఈకలు, అడవిజీవితంలో క్రొత్తమెరుగులు పెట్టాడు. మళ్ళా బర్మాయువకునితో గడిపిన అర్నెల్లూ మరుపుకొస్తున్నాయా అనిపించింది. కాని ఆయనతో ఎప్పుడూ దూరంగానే ఉండేదాన్ని. అనుకోకుండానే భగవంతుణ్ణి ప్రార్థించేదాన్ని మళ్ళానన్ను 'పతితు'రాలిని చెయ్యకుమా అని

కొంచం కాలం వెళ్ళగానే నాకెక్కడలేని అసూయ ప్రారంభించింది. తీరుబాటు పూర్వం కంటే ఎక్కువైంది. ఆలోచనల్లో పూర్వపు స్వేచ్ఛ, నిర్మలత తగ్గింది. పిల్లలు అల్లరిచేస్తే సహనంకూడా తగ్గింది. దీనితోపాటు తరుచూ తలనొప్పి వస్తూండడం, పనిపాట్లుమాని పండు కోవడం, అప్పుడే పిల్లలూ ఆయనా కిలకిలనవ్వుతూ పనులు చేసుకుపోతూండడం, నాలోచిన్న సుడి గాలిని లేవతీస్తూవచ్చింది ..ఒకనాడు తలనొప్పిగా ఉన్నప్పుడేమైదంటే, పిల్లలుగోల భూమీ ఆకాశం పట్టకుండా చేస్తున్నారు. కోపంతో నాలుగు వడ్డించాను. వాళ్లు మరీ గోల చేయడం మొదలు పెట్టారు. ఆయనెక్కణ్ణుంచో వచ్చి వాళ్ళని ఎడంగా తీసుకుని "తన పిల్లలు కాకపోతే ఎంతైనా కొట్టవచ్చు" అని సణిగాడు నాలోకోపం ఏడుపు రెండూ ఉద్రేకించి ఆయనమీదికో ఆడుపులి లా ఉరికాను "మళ్ళీ అను" అంటూ. చంటి పిల్లలా రెండు చేతులూ ఒంటిచేతో పట్టుకొని కొంటెగా నవ్వుతూ అదే మెల్లగా అన్నాడు. అతని చేతుల్లో నా అసహాయత్వం ఎంతో సౌఖ్యాన్నిచ్చింది. లొంగిపోయాను. ఆయన బలిష్టమైన చేతుల్లో నలిగిపోయాను.

అలా ఏడాదిన్నర గడిచింది. ఒక్కరోజు కూడా మళ్ళా విచారించడం కాని, తలనొప్పి రావడం, కాని జరగలేదు...ఏవో మళ్ళా అను కూలపరిస్థితు లేర్పడ్డాయి. అందులో మళ్ళా బర్మా ఆయనవచ్చి పిల్లల్ని తీసుకుపోయాడు. అదే సమయంలో ఇండియాదేశం చేరుకుందికి ఒక రక్షణదళం రావడం, నాతో ఉన్న హిందూ దేశస్థుడు వారిలోచేరి నన్ను హిందూదేశం చేర్చాడు. అప్పటికప్పుడే మా ఆయన హిందూ దేశం చేరుకొని నాకోసం గాలిస్తున్నారుట. ఇదంతా ఒక్కవారంలో జరిగిపోయింది. వాసు దేవుణ్ణి కలుసుకున్నాక నాలో యెక్కడలేని మార్పులూ వచ్చాయి. ఇప్పుడా హిందూదేశ స్తుడూ బర్మామనిషీ, సజీవులే. పేరుచెబుతే ఇట్టే పోల్చుకోగలవు. ఇప్పుడిద్దరూ చాలా పెద్ద పద వుల్లో ఉన్నారు." కథ సాంతంచేసింది వినత.

"చాలా విచిత్రమైనకథే" అన్నాది సునీతి.

చేయీచేయీ కలిపి, కారువరకూ నడచి, నిద్రపోతూన్న షోఫర్ నిలేపి ఇంటికి తిన్నగా పొమ్మని ఆజ్ఞాపించింది వినత...

"యిదంతా యెందుకు చెప్పానంటే, నీలో చల నానికి కారణం మానసికం అని నా అనుమానం. పురుషస్నేహంపొందడానికి నీకుకనబడిన మొదటి అవకాశాన్ని నీలోని ఈ మార్పులు కూరుస్తున్నా యేమో: అందుకని మీఆయన ఈమారురాగానే ఒకనెల పనికి స్వస్తిచెప్పి ఎక్కడన్నా, ఈనాగ రికతా ప్రపంచానికి దూరంగా గడుపు. అప్పటికీ నీలోని చపలత్వం నశించకపోతే నీయిష్టం.కొన్ని కొన్ని వాంఛలని మనం ప్రతిక్షేపించి వాటిని పొందడానికి ఏసూత్రం పనికొస్తుందో అని వెతక డంలో,ఇలాంటిఎండమావిప్రేమలకిగురియౌతాం" ఉద్రేకంతో గంభీరంగా చెప్పిన వినత మాటలు సునీతి చెవిలో గింగురుమన్నాయి. ★